

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు: చాటపర్రు సెక్షన్ పరిధిలోని 11 కెవి, చాటపర్రు-గుడివాకలంక పరిధిలోని గుడివాకలంక, కోటేశ్వరదుర్గాపురం, తిమ్మరాజుగూడెం, 11కెవి కొమడవోలు-ఆటోనగర్ ఫీడర్ పరిధిలోని ఆటోనగర్, కొమడవోలు, తూర్పులాకులు, సాయినగర్, హమాలీ కాలనీ ఏరియా లైన్లో చెట్టు తొలగించేందుకు ఈ నెల 25న శుక్రవారం ఉదయం 6.30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపి ట్రాన్స్‌కో ఇఇ కెఏం. అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.
పెదవేగి మండలం విజయరాయి సెక్షన్ పరిధిలోని 33/11 కెవి రాయుడుపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి రాయుడుపాలెం అగ్రికల్చర్ ఫీడర్‌లో చెట్ల తొలగింపునకు ఈ నెల 25వ తేదీ శుక్రవారం ఉదయం ఆరు గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అంబేద్కర్ తెలిపారు. రాయుడుపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని పరిసర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడునని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సొమ్ములివ్వరు.. గూడు చూపరు..!

- 2014-19లో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ బకాయిలపై సర్కార్ దొంగాట
- రెండు జిల్లాల్లో రూ.81.65 కోట్లు బకాయిల కోసం ఎదురుచూపులు
- రెండు జిల్లాల్లో నిరుపయోగంగా వేల సంఖ్యలో టిడ్కో ఇళ్లు
- ప్రభుత్వం చెబుతున్న మాటలకు.. చేతలకు పొంతన కరువు
- కూటమి వచ్చి ఏడాది గడుస్తున్నా లబ్ధిదారులకు దక్కని న్యాయం



నూజివీడులో నిరుపయోగంగా ఉన్న టిడ్కో ఇళ్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు.. ఆచరణకు పొంతన లేకుండాపోయింది. ముఖ్యంగా గృహ నిర్మాణాల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా మారింది. నష్టపోయిన గృహ నిర్మాణదారులకు న్యాయం చేయని పరిస్థితి నెలకొంది. 2014-19 మధ్య టిడిపి పాలనలో ఎన్‌టిఆర్ గృహనిర్మాణ పథకం కింద ఏలూరు జిల్లాలో 28,840, పశ్చిమలో 25,855 ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ఉన్న చిన్నపాటి ఇంటిని పడగొట్టి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. దీనిలో రూ.లక్షన్నర కేంద్ర ప్రభుత్వం, రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. కొంతమంది లబ్ధిదారులకు మొదటి విడత, మరికొంత మందికి రెండోవిడతగా కొంత సొమ్ము జమ చేయడం తప్ప పూర్తిస్థాయిలో సొమ్ము జమ చేయలేదు. చాలామందికి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి అందలేదు. 2019 ఎన్నికలకు ముందు ఇళ్ల బకాయిలు జమ చేస్తామని చెప్పినా అప్పట్లో టిడిపి ప్రభుత్వం చేయలే దు. తర్వాత జరిగిన ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం ఓటమి పాలైంది. అధికారంలోకి వచ్చిన వైసిపి సర్కార్ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల గురించి పట్టించుకోలేదు. దీంతో ఏలూరు జిల్లా పరిధిలో ఇళ్లు నిర్మించుకున్న 26,840 మంది లబ్ధిదారులకు రూ.40.90 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 25,855 మంది లబ్ధిదారులకు రూ.40.75 కోట్లు మొత్తం రూ.81.65 కోట్లు సొమ్ములు చెల్లించలేదు. దీంతో అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులంతా తీవ్ర ఇబ్బందుల్లో కూరుకుపోయారు. తాము మళ్లీ అధికారంలోకి వస్తే ఎన్‌టిఆర్ గృహనిర్మాణ బకాయిలు వెంటనే చెల్లిస్తామని గడిచిన ఎన్నికల్లో కూటమి నేతలు తెలిపారు. సర్వే చేసి బకాయిల లెక్కలు సైతం తేల్చారు. అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా ఇప్పటికీ ఒక్క రూపాయి బకాయి సొమ్ము చెల్లించలేదు. బకాయిల సొమ్ము కోసం లబ్ధిదారులకు ఎదురుచూపులే మిగిలాయి. ఇంటి బకాయి సొమ్ము ఇవ్వకపోవడంపై లబ్ధిదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

టిడ్కో ఇళ్ల కోసం ఎదురుచూపులే

2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో పెద్దఎత్తున టిడ్కో ఇళ్లను నిర్మించింది. చాలా ఇళ్లు దాదాపు 80 నుంచి 90 శాతం వరకూ పనులు పూర్తయ్యాయి. 2019 ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి రావడంతో టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వకుండా పాడుబెట్టింది. టిడ్కో ఇళ్లకు సంబంధించి మిగిలిన పనులను పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగిస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. ఇప్పటి వరకూ ఒక్క అడుగూ ముందుకు పడిన దాఖలాలు లేకుండాపోయాయి. కూటమి ప్రభుత్వం చెబుతున్న మాటలకు, చేతలకు పొంతన లేదంటూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో మొత్తం 11,816 టిడ్కో ఇళ్లను నిర్మించేందుకు అనుమతి ఇచ్చారు. 2,208 టిడ్కో ఇళ్లు 75 శాతానికిపైగా పూర్తయ్యాయి. మిగిలిన పనులను పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించకుండా అలానే వదిలేశారు. నూజివీడు టౌన్‌లో 2,640 ఇళ్ల వరకూ నిర్మించారు. మిగిలినవి పూర్తి చేసి ఇవ్వలేదు. జంగారెడ్డిగూడెంలో 937 టిడ్కో ఇళ్లు 90 శాతం వరకూ పూర్తయ్యాయి వాటి పరిస్థితీ అంతే. తాడేపల్లిగూడెం పట్టణంలో 5,376 టిడ్కో ఇళ్లకుగాను 650 ఇళ్లు మాత్రమే లబ్ధిదారులకు అందించారు. మిగిలినవి అలానే ఉన్నాయి. భీమవరం పట్టణంలో 9,600 టిడ్కో ఇళ్లకుగాను కొన్ని లబ్ధిదారులకు అందించారు. ఇంకా ఇవ్వాల్సిన ఇళ్లు అలానే ఉండిపోయాయి. మిగిలిన పట్టణాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. గృహాలకు సంబంధించిన విషయాల్లో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

26న కొల్లేరు గ్రామాల్లో

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పర్యటన



ప్రజాశక్తి - ఏలూరు

కొల్లేరు ప్రజల సమస్యలపై ఈ నెల 26న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కొల్లేరు ప్రాంతంలో పర్యటించనున్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు మంతెన సీతారాం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ నెల 26న ఉదయం తొమ్మిది గంటలకు గుడివాకలంకలో కొల్లేరు ప్రజలతో సమావేశం నిర్వహిస్తారని, అనంతరం పది గంటలకు పెదఎడ్లగాడి వద్ద కొల్లేరు పరిశీలన, 11 గంటలకు కొవ్వాడలంకలో కొల్లేరు ప్రజలతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. కొల్లేరును ఐదో కాంటూరు నుండి మూడో కాంటూరుకు కుదించడం ద్వారా కొల్లేరు ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, అందుకు సిపిఎం కృషి చేస్తుందని వివరించారు. ఇటీవల కొల్లేరు ప్రజల సమస్యలపై సిపిఎం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించిందని గుర్తు చేశారు. 26న జరుగుతున్న సిపిఎం రాష్ట్ర నాయకత్వ బృంద పర్యటనలో కొల్లేరు ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు పోశమ్మ

ఆశాలను ఉద్యోగులుగా గుర్తించాలి

జిల్లా సదస్సులో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆశా కార్యకర్తలను ఉద్యోగులుగా గుర్తించాలని, నేషనల్ హెల్త్ మిషన్‌కు నిధుల కేటాయింపు పెంచాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల వ్యవస్థ ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆశా వర్కర్ల జిల్లా సదస్సు గురువారం స్థానిక సీతారాం భర్తియా కళ్యాణ మండపంలో పి.కమల అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు పోశమ్మ మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా ఆశా కార్యకర్తలు ఎంతో నిబద్ధతతో ప్రజలను తమ సొంత బిడ్డలుగా భావిస్తూ తల్లీ పిల్లల మరణాలు తగ్గించడంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. జాతీయ ఆరోగ్య పథకానికి నిధులు పెంచాల్సిన అవసరం ఉందని, తద్వారా దేశంలో సామాన్యులకు వైద్యం అందుతుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి గ్రాట్యూటీ, ప్రావిడెంట్ ఫండ్, ఇఎస్ఐ, పెన్షన్ తదితర సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు ఐక్యంగా వాటి సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చి కార్మికులను బానిసలుగా మార్చే చర్యలకు పాల్పడుతోందన్నారు. వీటిని తిప్పికొట్టకపోతే కార్మిక వర్గం బానిసత్వానికి గురికాక తప్పదన్నారు. సకల కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా మే 20న దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆశాలు ఎన్నో పోరాటాల ఫలితంగా రూ.50 జీతం నుండి రూ.పది వేలకు పెంచుకున్నారన్నారు. రాజకీయ వేధింపులకు గురికాకుండా తమను తాము రక్షించుకున్నారని, ఇవన్నీ పోరాటాల ద్వారానే సాధ్యమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు విమల, స్కూల్ స్వీపర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు కె.విజయలక్ష్మి, ఆశా యూనియన్ జిల్లా నాయకులు లోకేశ్వరి, నవ్య, కామేశ్వరి, నాగ దుర్గ, విజయలక్ష్మి, ధనలక్ష్మి, పుల్లమ్మ, పావని, పార్వతి, సునీత, సీనియర్ ఆశా కార్యకర్త చిట్టెమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఆశా యూనియన్ అఖిలభారత వ్యవస్థాపక అధ్యక్షురాలిగా పని చేసి మరణించిన రంజనా నీరుల చిత్రపటానికి పోశమ్మ, లింగరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

డిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నాలో భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రమణరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీని అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన స్థానిక కార్మిక శాఖ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. తొలుత భవన నిర్మాణ కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం వద్ద సంఘం జిల్లా అధ్యక్షులు యర్రా రాంబాబు అధ్యక్షతన జరిగిన ధర్నాలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రమణారావు మాట్లాడారు. కార్మికులకు సంక్షేమ పథకాల అమలుకు ఆటంకంగా ఉన్న 1412 మెమో రద్దు చేయాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమ బోర్డులో నిధులను కార్మికుల కుటుంబాలకు మాత్రమే వినియోగించాలని సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారిన మళ్లించి వాడుకుంటుందని విమర్శించారు. వెంటనే. వెంటనే ఆ డబ్బులను సంక్షేమ బోర్డుకు జమ చేసి పెండింగ్లో ఉన్న క్లెయిములు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం డిప్యూటీ కమిషనర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ధర్నాలో అయినపర్తి మాధవ. సిహెచ్.కొండలరావు. షేక్ అబ్దుల్ అక్బర్, చీర అప్పారావు, పరస రాజేష్. కానా సాంబశివరావు. బత్తుల బుజ్జి, తాడి సత్యనారాయణ తదితరులు నాయకత్వం వహించి మాట్లాడారు.



ధర్నాలో నినదిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడికి కేంద్రానిదే బాధ్యత

బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించాలి

దాడిని ఖండిస్తూ పలుచోట్ల నిరసనలు



బుట్టాయగూడెంలో...

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

కాశ్మీర్‌లో టూరిస్టులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి మాట్లాడుతూ కాశ్మీర్‌లో జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. చనిపోయిన వారికి సంతాపం తెలిపారు. దేశంలో ఉన్న రక్షణ వ్యవస్థ లోపం వల్లే ఉగ్రవాదులు విచ్చలవిడిగా ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ కార్యదర్శి తెల్లం రామకృష్ణ, తామ ముత్యాలమ్మ, పోలోజు నాగేశ్వరరావు, వెట్టి వీరయ్య, చంద్రు బుల్లమ్మ, మడకం శ్రీదేవి, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : కాశ్మీర్లో ఉగ్రవాదులు జరిపిన హత్యాకాండలో 28 మంది మరణించడాన్ని ఖండిస్తూ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. కోట దిబ్బ సీతారాం భర్తీయా కళ్యాణమండపం నుంచి మార్కెట్ మీదుగా పాత బస్టాండ్ వద్దకు ఉగ్రవాదుల దాడులను ఖండించాలంటూ దేశ సమైక్యత సమగ్రతను కాపాడాలంటూ నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ నాడు మోడీ ప్రభుత్వం జమ్ముూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా ఉన్న 370 ఆర్టికల్ రద్దు చేస్తే ఉగ్రవాదానికి అడ్డుకట్ట పడుతుందని చెప్పారని గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వం వైఫల్యంతో ఉగ్రవాదం నిర్మూలించబడలేదని మరొకసారి రుజువైందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వివిఎన్.ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకులు కె.రామాంజనేయులు, ఎం.ఇస్సాకు, కె.పోచమ్మ, కమల, తదితరులు పాల్గొన్నారు.



ఏలూరులో...

సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

నూజివీడు టౌన్ : కాశ్మీర్‌లో పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరుతూ పట్టణంలో చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్ఆర్.హనుమాన్లు, సంసోను, బాజీ, ఆదిలక్ష్మి, జయలక్ష్మి, రజిని, దేవదాసు, రవికుమార్, నాగూర్, శ్రీను, రజిని, రాంబాబు, పావని పాల్గొన్నారు.



నూజివీడులో...

న్యాయవాదుల నిరసన ప్రదర్శన

పట్టణంలోని కోర్టు భవనాల వద్ద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి దారుణమన్నారు.

జంగారెడ్డిగూడెం: సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యాన కాశ్మీర్లోఉగ్ర దాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు, నాయకులు ఎస్‌కె.మాబు, బి.బాలరాజు, వి.గోపి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

కాశ్మీర్‌లో టూరిస్టులను హత్య చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు జిఎస్ఆర్.మూర్తి అధ్యక్షతన కోర్టు ఆవరణం నుంచి మసీదు సెంటర్, అక్కడ నుంచి బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. జంగారెడ్డిగూడెం బార్, సభ్యులు కోర్టు విధులను బహిష్కరించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మోడేపల్లి నాగులు, సీనియర్ న్యాయవాదులు పొన్నా లక్ష్మణరావు, పివి.కృష్ణారెడ్డి, ఎన్‌విబిఎల్.ఆచారి, సొబ్బన ఆనంద్, జువ్వల బాబూజీరావు, బండారు లతాకుమారి, వింజమూరి కిరణ్, కిషోర్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

ముదినేపల్లి : కాశ్మీర్ పహల్గాం ఘటనపై నిరసనగా ముదినేపల్లి స్పామ్ ఐటిఐ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు నల్ల బ్యాడ్జీలతో గురువారం నిరసన వ్యక్తం చేశారు. కాశ్మీర్ పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దారుణ మారణకాండలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలకు సంతాపం తెలిపారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాలేజీ ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ విద్యార్థులతో కలిసి మౌనం పాటించి అశ్రునివాళి చేశారు. వైస్ ప్రిన్సిపల్ కె.హరిత, అధ్యాపకులు ఒ.మణిభీమరాజు, బి.కృష్ణమోహన్, వివిఎన్.విజయదుర్గ, జివిఎన్‌వి.శివ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో...

ఫెయిలయ్యామని కుంగిపోవద్దు

సప్లిమెంటరీలో సత్తా చూపండి

విద్యార్థులకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి హితవు



ప్రజాశక్తి - ఏలూరు

ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేకపోయిన విద్యార్థులు ఎంతమాత్రం అధైర్యపడాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉద్బోధించారు. పబ్లిక్ పరీక్షల్లో చిన్నచిన్న పొరపాట్లు వల్ల మార్కులు తగ్గి ఫెయిలై ఉండొచ్చన్నారు. అంతేగానీ ఫెయిలయిన విద్యార్థులు తెలివితేటలు లేనివారు మాత్రం కాదని స్పష్టం చేశారు. ఈ సమయంలో నిరాశ చెందకుండా సాధన చేసి ఉత్తీర్ణులు కావాలన్నారు. విద్యార్థులకు అవసరమైన మెరుగైన విద్యా బోధన అందించేందుకు జిల్లాయంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. మే 19వ తేదీ నుండి 28వ తేదీ వరకు జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు ఆత్మ విశ్వాసంతో హాజరై ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. జిల్లాలో పదోతరగతి పరీక్షలకు 22,365 మంది విద్యార్థులు హాజరవ్వగా వారిలో 17,274 మంది ఉత్తీర్ణత సాధించారని, మరో 5,091 మంది ఫెయిలయిన విద్యార్థులు నిరాశ, నిస్పృహలకు గురికాకుండా ఉండేందుకు ప్రధానోపాధ్యాయులు వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ఆయా విద్యార్థులకు పునశ్చరణ తరగతులు కూడా నిర్వహించాలని ఆదేశించారు. ఫెయిలైన విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా ఎంఇఒలు, హెచ్ఎంలు కార్యాచరణ తయారుచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా ఒకటి, రెండు సబ్జెక్టుల్లో పాస్ కాని విద్యార్థులపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఉపాధి పని చేస్తూ మహిళా కూలీ మృతి

ప్రజాశక్తి - నిడమర్రు (ఉంగుటూరు)

ఉపాధి హామీ పనికి వెళ్లిన మహిళా కూలీ మృతి చెందింది. ఈ ఘటన నిడమర్రు మండలంలోని పెదనిండ్రకొలనులో గురువారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం... పెదనిండ్రకొలనుకు చెందిన కొరపాటి నాగమణి (48) గురువారం ఉదయం ఉపాధి హామీ పనికి వెళ్లింది. నాగమణి బోదెలో పూడిక తీస్తుండగా అకస్మాత్తుగా కింద పడిపోయింది. దీంతో అక్కడివారు ఆమెను స్థానిక పిహెచ్‌సికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఘటనపై నిడమర్రు పోలీసులు కేసు నమోదు చేశారు. నాగమణి కుటుంబసభ్యులకు ప్రభుత్వ పరంగా పరిహారం అందించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కమార్తెలకు వివాహాలు అయ్యాయి.



నాగమణి (ఫైల్‌ఫొటో)

ఉపాధి కూలీ నాగమణి కుటుంబాన్ని ఆదుకోవాలి

డ్వామా ఎఒకు వ్యకాస వినతి

ప్రజాశక్తి - ఏలూరు

ఉపాధి హామీ పని చేస్తూ పని ప్రదేశంలో మృతి చెందిన కొరపాటి నాగమణి కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని, నష్ట పరిహారం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం సంఘం జిల్లా కమిటీ బృందం డ్వామా ఎఒ రఘురామ్‌కు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ పని ప్రదేశాల్లో చనిపోతున్న కూలీల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిడమర్రు మండలం పెదనిండ్రుకొలనులో గురువారం దళిత మహిళ కూరపాటి నాగమణి (48) పని చేస్తూ బోదెలో పడి చనిపోయిందన్నారు. ఆమె కుటుంబానికి నేటికీ భూమి, సరైన ఇల్లు లేకపోవడం బాధాకరమన్నారు. నాగమణి మృతి ఆ కుటుంబానికి తీరని లోటన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉపాధి హామీ పనిలో చనిపోయిన కూలీల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. మృతురాలి కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలని, చదువకున్న పిల్లలకు ఎన్ఆర్ఇజిఎస్‌లో ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్.రాజశేఖర్, ఎం.సత్యం తదితరులు పాల్గొన్నారు.



డ్వామా ఎఒకు వినతి అందిస్తున్న నేతలు

ట్రిపుల్ ఐటి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

డైరెక్టర్ అమరేంద్ర కుమార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ఆర్‌జియుకెటి) పరిధిలోని ట్రిపుల్ ఐటి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు నూజివీడు ట్రిపుల్ ఐటి డైరెక్టర్ ఆచార్య అమరేంద్ర కుమార్ తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఆయన గురువారం మాట్లాడుతూ పదో తరగతి మార్కుల ఆధారంగా ఆరు సంవత్సరాల బీటెక్ ఇంజినీరింగ్ కోర్సులో నేరుగా ప్రవేశాలు కల్పించేందుకు ఆర్‌జియుకెటి 2025 - 26 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. జిల్లాలోని నూజివీడు, డాక్టర్ వైఎస్ఆర్ జిల్లాలోని ఆర్‌కె.వ్యాలీ(ఇడుపులపాయ), ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, శ్రీకాకుళం జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటి క్యాంపస్లు కొనసాగుతున్నట్లు చెప్పారు. పదో తరగతి మార్కుల ఆధారంగా విద్యార్థులు ఈ నెల 27వ తేదీ నుంచి మే 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి వెబ్ సైట్ https://www.rgukt.in లేదా ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసేందుకు జనరల్ అభ్యర్థులు రూ.300, రిజర్వ్ అభ్యర్థులకు రూ.200, ఇతర రాష్ట్రాల అభ్యర్థులు రూ.వెయ్యి రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. రిజర్వేషన్ విధానాలను అనుసరించి పదో తరగతిలో మెరిట్, అర్హత పరీక్షల్లో ప్రతి సబ్జెక్టులో పొందిన మార్కుల ఆధారంగా అడ్మిషన్లు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి దశకు సంబంధించి పారదర్శకంగా వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న అమరేంద్రకుమార్

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని స్థానిక బాలాజీ నగర్ శ్రీ చైతన్య పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ఎనలేని ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు 550 మార్కులకు పైగా 19 మంది, 500 మార్కులకు పైగా 38 మంది సాధించారన్నారు. ప్రతి ముగ్గురిలో ఒక్కరు 550 పైగా మార్కులు, ప్రతి ఇద్దరిలో ఒక్కరు 500పైగా మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎపిఎస్ఆర్టిసి విజయవాడ రీజియన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అభినందించారు. ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న రెడ్డి అప్పలనాయుడు

శశి హైస్కూల్ విద్యార్థుల విజయపరంపర

ప్రజాశక్తి - కలిదిండి

పదో తరగతి ఫలితాల్లో స్థానిక శశి హై స్కూల్ విద్యార్థులు తమ విజయపరంపర కొనసాగించినట్లు కరస్పాండెంట్ జివి.నర్సింహారావు రాజు తెలిపారు. 16 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభతో తమ సత్తా చాటారన్నారు. ఎం.కార్తీక్ 570, అఖిల 563 మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారన్నారు. ప్రిన్సీల్ 538, ఖరీమ్ 536, ఎన్.శ్రావణ్ 526, నిహారిక 525, సిరిషా 519, ఆసిఫ్ 518, ప్రేరణ 512, షాహిద తబోస్సుం 512, రితిక శ్రీ 508, తేజస్విని 508, నరసింహస్వామి 504, కనక సాయి హర్షిత 504, పద్మ 501, ఉష శ్రీ 500 మార్కులు సాధించారన్నారు. మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు, ఫలితాల సాధనకు కృషి చేసిన శశి సిబ్బందికి కరస్పాండెంట్ జివి.సత్యనారాయణ రాజు అభినందనలు తెలిపారు.


కార్తీక్


అఖిల

స్నేహ రైడ్స్ విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని స్నేహ రైడ్స్ అనాథ ఆశ్రమంలోని బాలబాలికలు పది ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. ఏ విధమైన ట్యూషన్స్, ప్రత్యేక శిక్షణ లేకుండానే ఇక్కడి బాలబాలికలు ఎంతో ప్రతిభ కనబరిచారు. పట్టణంలోని జెడ్పి బాలికల హైస్కూల్లో చదువుకుంటూ స్నేహ రైడ్స్ అనాథ ఆశ్రమంలో ఆశ్రయం పొంది గొప్ప ప్రతిభ కనపరిచినట్లు స్నేహ రైడ్స్ చైర్మన్ బసవరాజు నాగేశ్వరరావు తెలిపారు. వ్యక్తిగత జీవితాల్లో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూనే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. కుటుంబాల్లో ఎలాంటి పరిస్థితులు ఎదురైనప్పటికీ చదువు పట్ల శ్రద్ధతో ముందడుగు వేసి అందరి ప్రశంసలు పొందడం ప్రశంసనీయమన్నారు. స్నేహ రైడ్స్లో ఎం.సుష్మ 577 మార్కులు, బి.ఐశ్వర్య 565, యు.స్నేహ 523, కె.మీనాక్షి 488, విజిఎన్.సాయిచరణ్ 553 మార్కులు సాధించి ప్రయివేట్, కార్పొరేట్ స్థాయి విద్యాసంస్థలకు ధీటుగా నిలిచినందుకు పండుగ వాతావరణం ఏర్పడిందన్నారు. జెడ్పి బాలికల హైస్కూల్లో తమ విద్యార్థుల పట్ల వ్యక్తిగత శ్రద్ధతో పాఠ్యాంశాలు బోధించడం, పౌష్టికాహారం అందించడంతో ఇంతటి ప్రతిభ సాధ్యమైందని వివరించారు.


సుష్మ


ఐశ్వర్య

అను హైస్కూల్కు నూరు శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని మూలలంక అను హై స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ ఎస్వి.రాఘవయ్య తెలిపారు. నూరుశాతం ఉత్తీర్ణతతో పాటు కడలి కార్తీక్ 565 మార్కులు, జల్లా గోవర్ధని 519 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. విద్యార్థులకు ఎస్వి.రాఘవయ్య అభినందనలు తెలిపారు.

దాతల సాయంతో అదనపు తరగతి గదుల నిర్మాణం

ప్రజాశక్తి - టి.నరసాపురం

దాతల సహకారంతో అదనపు తరగతి గదులు నిర్మాణం చేపట్టినట్లు తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని తిరుమలదేవిపేట యుపి పాఠశాల హైస్కూల్గా అప్ గ్రేడ్ కావడంతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి గురువారం నాయకులు భూమి పూజ చేసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలదేవిపేట గ్రామంలో ఉన్న యుపి స్కూల్ను అప్గ్రేడ్ చేసి హైస్కూల్ చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు రావడంతో విద్యార్థులకు సరిపడా గదులు లేని కారణంగా, తరగతి గదులను నిర్మాణానికి గ్రామస్తులు, కూటమి నాయకులతో కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. త్వరితగతిన గదుల నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట సత్యనారాయణ, పండు, వీరాస్వామినాయుడు, పివివిఎస్.రామలింగేశ్వరావు, పుల్లారావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - టి.నరసాపురం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహద పడతాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వెలగపాడు పంచాయతీలోని వీర భద్రవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలని ఆయన తెలిపారు. వేసవి దృష్ట్యా మండలంలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జలపాలు, పంచాయతీ కార్యదర్శి చిన్ని రాధాకృష్ణ, శీలం సాయి వినయ్, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్ల రద్దు కోరుతూ ధర్నా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు డి.హరినాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రోగ్రెస్ మిడ్ డే మీల్ వర్కర్స్, శానిటేషన్ వర్కర్స్, నైట్ వాచ్మ్యాన్ వర్కర్స్ ఫెడరేషన్స్ ఆధ్వర్యంలో ఎఐసిసిటియు జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య అధ్యక్షతన గురువారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా డి.హరినాథ్ మాట్లాడుతూ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా మే 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసిటియు జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆర్టిసి బస్సు-బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆర్టిసి బస్సు, బైకు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటన గురువారం సాయంత్రం ముదినేపల్లిలోని గుడివాడ రోడ్డులో పెట్రోల్ బంక్ సమీపంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... బంటుమిల్లి నుంచి ప్రయాణికులతో గుడివాడ వెళ్తున్న ఆర్టిసి బస్సు, గుడివాడ వైపు నుంచి ముదినేపల్లి వస్తున్న బైకు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ పైన ఉన్న ముదినేపల్లి అంబేద్కర్ కాలనీకి చెందిన కంచర్ల రాజశేఖర్(గోపీ), వినుకొండ సునీల్ అనే ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో కంచర్ల రాజశేఖర్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణలకు అడ్డాగా కొత్తపల్లి సెంటర్

ప్రభుత్వ స్థలాల్లో దుకాణాల ఏర్పాటు

వాహనాలకు మార్గం సరిపోక తరచూ ప్రమాదాలు

ఇబ్బందులను తొలగించాలని ప్రయాణికుల వేడుకోలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి - బంటుమిల్లి ఆర్అండ్బి రోడ్ ఆక్రమణకు గురవుతుంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. మండలంలోని వణుదుర్రు గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తపల్లి సెంటర్ ఆక్రమణలకు అడ్డాగా మారింది. బడాబాబులు ఆర్అండ్బి రోడ్డును, ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తూ పక్కా దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కొత్తపల్లి సెంటర్ నాలుగు రోడ్ల జంక్షన్లో ఉండడం వల్ల ఆక్రమణల కారణంగా ఎదురెదురుగా వస్తున్న వాహనాలకు మార్గం సరిపోక తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. సెంటర్లో ఆక్రమణలు ఎక్కువ కావడంతో తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతూ క్షతగాత్రులుగా మారుతున్నారు. బడాబాబులు బస్సు షెల్టర్ను ఆనుకుని దుకాణాలు ఏర్పాటు చేయడంతో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అంతేకాక సెంటర్లో అల్పాహార దుకాణాలు, సోడా బండ్ల వద్దకు వచ్చే ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను రోడ్లపైనే నిలిపేయడంతో ట్రాఫిక్కు అంతరాయం కలుగుతూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై సంబంధిత అధికారులకు, పంచాయతీ పాలకవర్గానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ పలువురు కొత్తపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెంటర్లోని ఆక్రమణలు తొలగించి ప్రజలు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను తీర్చాలని పలువురు కోరుతున్నారు.


ఆక్రమణలో కొత్తపల్లి సెంటర్

గ్రామీణాభివృద్ధికి పంచాయతీరాజ్ వ్యవస్థ పునాది

పలుచోట్ల ఘనంగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కొయ్యలగూడెం మండల పరిషత్ ఆధ్వర్యంలో గురువారం విశేష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంప్రదాయ బుర్రకథ ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత ప్రాముఖ్యత, ప్రభుత్వ పథకాలు, మండలంలో ఇప్పటివరకు నిర్మించిన రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థలు, కల్వర్టుల గురించి ప్రజలకు వివరించారు. ఎంపిడిఒ కె.కిరణ్కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం గ్రామ పంచాయతీల పాత్రను, స్థానిక స్వపరిపాలన వ్యవస్థ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను ఉద్ఘాటించింది. బుర్రకథ ద్వారా పరిశుభ్రతపై, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన వంటి ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలో నిర్మించిన మౌలిక వసతులైన రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణ పురోగతిని కూడా వివరించారు. ఎంపిడిఒ కిరణ్కుమార్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థ గ్రామీణాభివృద్ధికి పునాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముదినేపల్లి : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వడాలి, ముదినేపల్లి తదితర గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామ సభలు నిర్వహించారు. వడాలిలో జరిగిన గ్రామసభలో ముఖ్య అతిథిగా టిడిపి కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు పాల్గొనగా మిగిలిన చోట్ల జరిగిన గ్రామ సభల్లో ఆయా పంచాయతీల పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముసునూరు : పంచాయతీరాజ్ చట్టం ద్వారా సంస్కరణలను చేపట్టి ప్రభుత్వ పరిపాలన ప్రజలకు మరింత దగ్గర చేకూర్చేందుకు జాతీయ పంచాయతీరాజ్ చట్టం ఎంతోగానో ఉపయోగపడిందని ఎంపిడిఒ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎం.నీరజనాయుడు, సుజాత, ధర్మవతి, ఎంపిడిఒ ఆఫీస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు సిటీ :పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్సి సర్పంచుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొండెం సంతోష్కుమార్ కోరారు. ఏలూరులోని నరసింహారావు పేటలో ఉన్న ఎస్సిఆర్పిఎస్ ఎఐఎవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకమైందని, మేధావులతో కూడిన అనేక కమిటీలను ఏర్పాటు చేశారని తెలిపారు. గతంలో పంచాయతీరాజ్ బలోపేతం కోసం ఎంతోమంది కృషి చేశారని తెలిపారు.

భీమడోలు : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల వద్ద గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం కార్యక్రమాన్ని ఎంపిడిఒ పద్మావతిదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. పొలసానిపల్లిలో సర్పంచి షేక్ రహీమా బేగం హసేన కేక్ కట్ చేసి మిఠాయిలను పంచారు. గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పంచాయతీరాజ్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. గుండుగొలను గ్రామంలో ఇన్ఛార్జి గ్రామపంచాయతీ కార్యదర్శి తనూజ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. భీమడోలు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి తనూజ ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, గ్రామ సచివాలయ కార్యదర్శి హేమసుందర్ పాల్గొన్నారు. తొలుత కాశ్మీర్ ఉగ్రదాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించి చనిపోయినవారికి నివాళులను సమర్పించారు. అనంతరం కళాజాతా బృందం శానిటేషన్ కార్యక్రమాలపై ప్రదర్శనలు చేసింది.

చాట్రాయి : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా చాట్రాయిలో ఎంపిడిఒ విజయలక్ష్మి గ్రామసభ ఏర్పాటు చేశారు. గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఐ.విజయలక్ష్మి మాట్లాడుతూ జాతీయ పంచాయతీ దినోత్సవం ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. సభలో కళాజాతా ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మట్టా శివనాగరాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సెలవుల్లో పిల్లలకు శిక్షణ ఇప్పించాలి

ఎంపీ పుట్టా మహేష్కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పిల్లలకు వినోదంతో కూడిన విజ్ఞానం పెంపొందించడానికి స్పోర్ట్స్, గేమ్స్, సాంప్రదాయం నృత్యాలు, చదరంగం వంటి అంశాలు శిక్షణ ఇప్పించాలని పేర్కొన్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో చెరువుల్లో, వాగులు, కాలువల్లో ఈత కొట్టేందుకు పిల్లలు వెళ్లే అవకాశం ఉందని, నీటి వనరుల వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెట్రిసెల్విని కోరుతూ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లేఖ రాసినట్లు తెలిపారు. నీటి వనరుల వద్ద సచివాలయ సిబ్బంది, గ్రామస్థాయిలో పనిచేసే ఉద్యోగులకు పర్యవేక్షణ బాధ్యతను ఉపయోగించాలని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు సేవలు వినియోగించుకోవాలని తెలిపారు.

కాశ్మీర్లో ఉగ్ర దాడిపై ముస్లింల ఖండన

ప్రజాశక్తి - చింతలపూడి

భారతదేశం అంటేనే భిన్నత్వంలో ఏకత్వామని, భారత రాజ్యాంగం సూచించిన విధంగా కుల మతాలకు అతీతంగా దేశంలో అందరూ సోదరుల్లా కలిసి మెలిసి ఉంటున్నారని మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ రహీమ్ అన్నారు. జామియా మసీదు ఆవరణలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిని చింతలపూడి పట్టణ జామియా మసీదు కమిటీ, పట్టణ జమాతే ఇస్లామీ హింద్ తరపున ఖండిస్తున్నట్లు తెలిపారు. దేశ అభివృద్ధి, మత సామరస్యం ఓర్వలేక ఉగ్రవాదులు కాల్పులు జరపడం పిరికి పంద చర్య అన్నారు. జమాత్ ఇస్లామీ హింద్ పెద్దలు ఎండీ అక్బర్ అలి మాట్లాడుతూ ఇస్లాం అంటేనే శాంతి అని, ఇస్లాంలో హింసకు తావు లేదని, హింసకు పాల్పడే వారు నిజమైన ముస్లిం కాజాలరని మహమ్మద్ ప్రవక్త ఆనాడే తెలిపారన్నారు. ఈ సమావేశంలో మసీదు కమిటీ కార్యదర్శి ఎండీ జిలాని, కమిటీ ముఖ్య కార్యవర్గ సభ్యులు ఎండీ ఇస్మాయిల్, సయ్యద్ రజాక్, సుభాని, ఇమ్రాన్, పాషి, అబిద్, అజాద్, రసూల్, వహాబ్, ముజీబ్, జానీ, సల్మాన్, మసీదు ఇమామ్, మౌజన్ పాల్గొన్నారు.

4 నుంచి ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - ముసునూరు

ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ద్వారా యువకులు వ్యసనాలకు అలవాటు పడకుండా ఆటలకు, క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారనే ఉద్దేశంతో క్రికెట్ టోర్నమెంట్ పెడుతున్నట్లు టిడిపి వేల్పుచర్ల గ్రామ నాయకులు గరికముక్కు నాని అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో కరణం బుచ్చిబాబు తోటలో వచ్చేనెల నాలుగో తేదీ నుంచి ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ను రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రికెట్ టోర్నమెంట్లో ప్రథమ బహుమతి రూ.33,333, ద్వితీయ బహుమతి రూ.22,222, తృతీయ బహుమతి రూ.9,999, అలాగే బెస్ట్ బ్యాట్స్మెన్, బెస్ట్ క్రికెటర్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సిరీస్ వంటి వారికి ప్రత్యేక బహుమతులు ఉన్నాయని తెలిపారు. నేటి నుంచి యువకులు తమ ఆధార్ కార్డు తీసుకుని ఎంట్రీ చేయించుకోవాలని తెలిపారు. గ్రామీణ యువకులు మాత్రమే ఈ ఆటలు ఆడేందుకు అర్హులని తెలిపారు.

సూర్యఘర్పై ఐటిఐ విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని స్వామ్ ఐటిఐ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సూర్యఘర్ పథకం కింద సోలార్ ఏర్పాట్లపై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఏలూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాల జిల్లా శిక్షణ అధికారి కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్జియుకెటి-మెటా గేట్ల మధ్య అవగాహన ఒప్పందం


ఒప్పందం చేసుకుంటున్న ఆర్జియుకెటి-మెటా గేట్ అకాడమీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్జియుకెటి ఇన్స్టిట్యూట్స్లోని మెటలర్జీ, మెటీరియల్స్ ఇంజినీరింగ్ విభాగం, హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న మెటా గేట్ అకాడమీల మధ్య ఒక అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈ అవగాహనా ఒప్పందంపై ఆర్జియుకెటి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్, మెటా గేట్ అకాడమీ డైరెక్టర్ ఎన్.గురుప్రసాద్ సంతకం చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ మెటలర్జీ ఇంజినీరింగ్ విభాగం దేశంలోని కొన్ని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లోనే ఉందన్నారు. ఆర్జియుకెటిలో కూడా ఉండటం గర్వకారణమన్నారు. దేశవ్యాప్తంగా ఈ విభాగం నుంచి పరిమితంగానే విద్యార్థులు బయటకు వస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆర్జియుకెటి మెటలర్జీ విభాగంలోని విద్యార్థులు వంద శాతం ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. గత కొన్నేళ్లుగా జాతీయ స్థాయిలో నిర్వహించే గేట్ పరీక్షలో సైతం మెటలర్జీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరుస్తూ, జాతీయ స్థాయి 21వ ర్యాంక్తో పాటు, ఎన్నో ఉత్తమ ర్యాంకులు కూడా సాధించారన్నారు. దేశంలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, ప్రఖ్యాత కంపెనీల్లో విద్య ఉద్యోగ అవకాశాల కోసం గేట్ ప్రవేశ పరీక్షలో అత్యధిక మార్కుల శాతం సాధించాల్సి ఉందన్నారు. ఆ దిశలో విద్యార్థులకు మరింతగా నైపుణ్యాలను, శిక్షణను అందించేందుకు మెటా గేట్ అకాడమీతో ఒప్పందం చేసుకుంటున్నామన్నారు. మెటా గేట్ అకాడమీ డైరెక్టర్ ఎన్.గురుప్రసాద్ మాట్లాడుతూ ఆర్జియుకెటి విద్యాలయంలో ఉత్తమ ప్రతిభ గల విద్యార్థులు అత్యధిక శాతం పేద కుటుంబాల నుంచి వస్తున్నారన్నారు. మెటలర్జీ విభాగాధిపతి డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్జియుకెటి ఇన్స్టిట్యూట్స్లోని మెటలర్జీ విద్యార్థులకు మెటా గేట్ శిక్షణ సంస్థతో జరిగిన ఒప్పందం ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మెటా గేట్ అధ్యాపకులు పి.కుమార్, విట్టల్, ఆర్జియుకెటి - ఇటిపి సెంట్రల్ డీన్ పి.శ్యామ్, హైయర్ ఎడ్యుకేషన్ సెల్ కో-ఆర్డినేటర్ ఎం.రామకృష్ణ, ఆర్జియుకెటి నూజివీడు క్యాంపస్ డీన్ డాక్టర్ ఎస్.చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్, సెంట్రల్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ బి.ప్రసాద్, సెంట్రల్ డీన్ ఎవాల్యుయేషన్ డాక్టర్ షేక్ రియాజ్, సెంట్రల్ డీన్ అకాడమిక్స్ శ్రావణి, ప్లేసెమెంట్ ఆఫీసర్ డాక్టర్ చింతయ్య నాయుడు, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల ప్రక్రియ గడువు పొడిగించాలి

డిఇఒకు అపుస్మా వినతి

ప్రజాశక్తి - ఏలూరు

వెనుకబడిన తరగతుల ప్రజల కోసం ఏర్పాటైన విద్యాహక్కు చట్టం (ఆర్టిఇ) 12(1సి) 25 శాతం ఉచిత విద్య జిఒను గత ప్రభుత్వం 2023 ఫిబ్రవరిలో ప్రవేశ పెట్టిన విషయం అందరికీ తెలిసిందే. ఒకటో తరగతి చదివే విద్యార్థులకు ఉచిత విద్య కోసం మళ్లీ ఈ విద్యాసంవత్సరం 2025-26 కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం, అధికారులు ప్రయివేట్ యాజమాన్యాలను ఒత్తిడి చేస్తున్నారని, కాని ప్రయివేట్ యాజమాన్యాలు ఆ రిజిస్ట్రేషన్ ప్రక్రియ గడువు పొడిగించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అపుస్మా జిల్లా అధ్యక్షులు శివకుమార్శర్మ, కార్యదర్శి ఎన్ఆర్కెవి.ప్రసాద్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎంబిఎస్.శర్మ, వెంకటేశ్వరరావు, సతీష్, శేఖర్, మనోహర్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టానికి 25 శాతం ప్రవేశాలకు తాము వ్యతిరేకం కాదని, కాని గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు పారదర్శక లేని విధంగా జిఒను అమలు చేస్తున్నాయని చెప్పారు. ఒకప్పుడు బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పేరుతో ఉచిత హాస్టల్ విద్యను అందించిన ప్రయివేట్ పాఠశాలలకు రాష్ట్రంలో రూ.వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, గత, ప్రస్తుత ప్రభుత్వాలు చెల్లించలేదన్నారు. గత మూడేళ్లుగా విద్యా హక్కు చట్టం అమలు చేయడం ద్వారా జిల్లా మొత్తం మీద ఏటా 800 నుంచి 900 అడ్మిషన్ల నిమిత్తం ప్రభుత్వం నుంచి ఒక్కో జిల్లాకు సుమారు రూ.రెండు కోట్ల బకాయిలు పడిందని, ఒక్క పైసా కూడా ప్రభుత్వం చెల్లించలేదని చెప్పారు. ఆర్టిఇ ఉచిత అడ్మిషన్ పొందిన ప్రతి స్కూల్కు నిలిచిన బకాయిలు చెల్లించాలన్నారు. లేదా రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త పాఠశాలలను ప్రారంభించాలని, ఇది కనీస భాధ్యతగా గుర్తించి న్యాయం చేయాలని కోరారు. అప్పటివరకు అడ్మిషన్ల ప్రక్రియ గడువు పొడిగించాలని కోరారు.


డిఇఒకు వినతి అందిస్తున్న అపుస్మా నేతలు

వేసవిలో అప్రమత్తత అవసరం

వడదెబ్బపై అవగాహనా ర్యాలీలో అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు


ర్యాలీలో మాట్లాడుతున్న గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వేసవి కాలంలో తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని, అజాగ్రత్తగా ఉంటే అధిక వేడి వల్ల ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, తీవ్రమైన వడదెబ్బ ప్రాణాపాయమని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు ప్రజలకు సూచించారు. ఏలూరులోని స్థానిక ఆమదాల అప్పలస్వామి పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో గొల్లాయిగూడెం-1 రాజీవ్ గృహ కల్ప కాలనీలో స్థానిక ప్రజలకు వడదెబ్బ, జ్వరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ అధిక వేడి వల్ల మన శరీరంలో ఉండే నీరు చెమట రూపంలో బయటకు పోవడం వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. తీవ్రమైన వడదెబ్బ వల్ల శరీర ఉష్ణోగ్రత పెరగడం, డిహైడ్రేషన్కు గురవడం, వాంతులు అవడం, ఆయాసపడి నిరసించిపోవడం తదితర లక్షణాలు ఉంటాయని తెలిపారు. వడదెబ్బ నుంచి రక్షించుకోవాలంటే 12 గంటల్లోపు పనులు ముగించుకోవాలని, మళ్లీ నాలుగు గంటల తర్వాత పనులు చేసుకోవాలని చెప్పారు. ఎక్కువగా ద్రవపదార్థాలైన కొబ్బరి బొండాలు, మజ్జిగ, ఒఆర్ఎస్ ద్రావణం, మంచినీరు తీసుకోవాలని, లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలని, తలపాగా, టోపీ, గొడుగు వాడాలని సూచించారు. వయసులో పెద్దవారు, గర్భిణులు, చిన్నపిల్లలు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉండడంతో ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేసవికాలంలో సాధారణ జ్వరాలు కూడా వచ్చే అవకాశం ఉందని, మలేరియా, డెంగీ దోమల నిర్మూలనకు వారానికి ఒకసారి డ్రైడే ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవ్య, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాస్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోనేరు హంపికి మంత్రి పార్థసారధి అభినందన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపికి రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి గురువారం హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఎఫ్ఐడిఇ ఉమెన్స్ గ్రాండ్ ఫిక్స్లో చారిత్రాత్మక విజయం సాధించడంతో హంపి చెస్ ఆటలో నిజమైన లెజెండ్ అని మరోసారి రుజువైయిందన్నారు. గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి మరిన్ని గొప్ప విజయాలు సాధించాలని, చదరంగం బోర్డుపై ఆమె ప్రతిభ ఇలాగే ప్రతిబింబిస్తూ ఉండాలని ఆకాంక్షించారు.

కొనసాగుతున్న మరమ్మతు పనులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

గత నాలుగు రోజులుగా జరుగుతున్న దెందులూరు సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వాటర్ లీకేజీకి మరమ్మతు పనులు గురువారం కూడా కొనసాగాయి. పబ్లిక్ హెల్త్ ఇఎన్సి మరియన్న సూచనల ప్రకారం ఇసుక బస్తాలు వేసి నున్నటి గ్రావెల్తో ఫిల్ చేసి ప్యాకింగ్ చేసే పనులు పూర్తయ్యాయని, ఇంకా రెండు రోజులు అబ్జర్వేషన్లో ఉంచాలని కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు పెదబాబు, ఎఇ సురేంద్రబాబు, ఎస్ఇ సుధాకర్, డిఇ ఫణిభూషణరావు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ కోచింగ్ కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్లేస్మెంట్సెల్ ఇంటర్న్షిప్ విభాగం, ఒటిపి టెక్నాలజీస్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ కోర్స్ ఆఫీస్ మేనేజ్మెంట్, అడ్మినిస్ట్రేషన్లో 40 రోజుల కోర్స్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు తెలిపారు. 60 మందితో ప్రారంభించిన ఈ కోర్సులో ఇప్పటికే 30 మంది విద్యార్థులను ఎంపిక చేసుకున్నట్లు చెప్పారు. మిగిలిన 30 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం ఉత్తీర్ణులైనవారికి కళాశాల అవకాశం కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఈ నెల 26వ తేదీ లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ముందుగా నమోదు చేసుకున్న అభ్యర్థుల్లో 30 మందికి మాత్రమే అవకాశం ఉంటుందని ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ కొండా రవి తెలిపారు. వివరాలకు కళాశాలకు స్వయంగా గాని లేదా 8125155788 ఫోన్ నెంబర్ ద్వారా వివరాలను పొందవచ్చని చెప్పారు. విజయవంతంగా కోర్సు పూర్తి చేసిన వారికి అప్రూవ్డ్ సర్టిఫికెట్ ప్రధానం చేస్తారని తెలిపారు. ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు కోరారు.

హైస్కూల్లో యోగా పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో గల శ్రీ అన్నేరామకృష్ణయ్యజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా పోటీలు నిర్వహించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.రాధికారాణి తెలిపారు. ఈ సందర్భంగా జూనియర్ విభాగంలో స్కూల్ చివరిరోజున పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ పోటీల్లో 52 మంది విద్యార్థులు పాల్గొన్నారు. యోగా పోటీల్లో పద్మాసనం, బుద్ధ పద్మాసనం, వజ్రాసనం, పశ్చిమోత్తాసనం, సింహాసనం, సవాసనం, చక్రాసనం, వక్రాసనం, తాడాసనం, త్రికోణాసనం, వీరాసనం, ధనురాసనం, పర్వతాసనం, భుజంగాసనం, హలాసనం మధ్య పోటీలు నిర్వహించగా ఎనిమిది మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారని తెలిపారు. విజేతలుగా నిలిచిన సుచంద్రిక, షేక్ మునీర్, విజయ భాస్కర్, జయశ్రీ, వరసాయి, ప్రైజీ, శిరిణి, జగదీష్లకు జీవ శాస్త్ర ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, పార్ట్ టైమ్ ఇన్స్ట్రక్టర్ లక్ష్మి బహుమతులును స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర, సాకారవి, నాన్ టీచింగ్ సిబ్బంది నారాయణ పాల్గొన్నారు.

మేడేను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

మేడే దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో నగర పంచాయతీ ముఠా సంఘాల కార్మిక సంఘ సమావేశం మొగిల్ల శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కంకిపాటి బుచ్చిబాబు మండలంలో మేడే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తొర్లపాటి బాబు, ఎఐటియుసి నాయకులు ఎం.వెంకటేశ్వరావు, కె.అప్పారావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి కార్యాలయంపై దాడి అమానుషం : ఎపిడబ్ల్యూజెఎఫ్

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరులో సాక్షి కార్యాలయంపై జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎడి.జబీర్, కార్యదర్శి వైవి.హరీష్, రాష్ట్ర కార్యదర్శి కెవిఎస్.శంకరరావు, రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు టి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు కె.బాలసౌరి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సంఘటనపై పోలీస్ శాఖ తగు విచారణ జరిపి నిజానిజాలను వెలికి తీయాలని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. సమస్య ఏదైనా ఉంటే చట్ట ప్రకారం వెళ్లాలని, అంతేగాని చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదని పేర్కొన్నారు.